కొట్టాట్లోంచి అయిదు తీసుకున్నాను. చివరి కయి ఎవడో ముష్టెదవ ఎత్తుకుపోయాడులే ... ఇంతకీ నీ కిదేం పోయే కాలం?" అంది నా కొళ్ళు మండిపోయింది. 'నన్నే ఎదిరిస్తోందా' అనుకున్నాను "అంటే?" అన్నాను.

"అయి 'ఆ బాపత'ని నాకు చెప్పద్దా. జాగర్తగా దాచేదాన్ని గందా" అంది ఇప్పుడీ ఊబిలోంచి బయట పడడమెలాగ? వారం అయింది ఇక్కడి కొచ్చి మంత్రి బావగారు డ్యూటీ మీద జపానెళ్లాడంట ముఖ్యమంత్రికీ , నాకూ చుక్కెదురు. ఈ సి.ఐ.డి ని చూడబోతే నా తాలూకా పంతులమ్మ రేప్‌కేసులూ, మర్డర్ కేసులూ కూడ కెలికేట్లున్నాడు ఎంతగానో బతిమాలుతున్నాను, "ఇంత , ఇంతకాకపోతే అంత, అంత కాకపోతే మరోఅంత పుచ్చుకోవయ్యా" అని. "ససేమిరా" అంటున్నాడు. లోకల్ సి.ఐ డి.ల పర్సనల్ రిపోర్టులు రాసే అధికారం ఎమ్.ఎల్ ఎలకు ఎప్పుడొస్తుందో గదా!

నాకీ కష్టాలు రావడానికి కారణం ఆ గుమాస్తాగాడే. కొంపదీసి ఆడు నా ఇంటికి మారుమొగుడు కాడుకదా! ఇంతకీ ప్రజల్లో, ముఖ్యంగా ఉద్యోగస్థుల్లో నీతి అనేది చచ్చిపోయింది. న్యాయం అసలే లేదు మరింక ఈ దేశానికి మోక్షమే లేదు!

(ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక 11-4-73)

*** *** ***

# శిలాశాసనం

ప్రిన్సిపాల్ పరీక్షిత్తు నెత్తిమీద కొత్త ఉషాఫాన్ ఫుల్ స్పీడ్ లో తిరుగుతోంది. అతని కుర్చీ చుట్టూ ఆఫీసు పరివారం- సూపర్నెంటు, యుడిసి యల్.డి.సీ., టైపిస్టూ, ప్యూన్లూ ఉన్నారు. లెక్చరర్లలో నమ్మిన బంట్లన్నవారు కూడా కొంతమందయినా అప్పుడు అక్కడుండాల్సిందే. కానీ, అతనికీ లెక్చరర్లకూ చెడింది. స్టూడెంట్సు తమంత తాముగా తమడిపాజిట్ల డబ్బు త్యాగం చేసి కాలేజికి ఒక ఫాను కొనిచ్చారు, ఈ కొనటంలో వాళ్ళకు సలహా లిచ్చినవాళ్ళు లెక్చరర్లు, కొంత డబ్బును లెక్చరర్లు అమ్మ్యామ్యా చేసి ఉంటారని ప్రిన్సిపాల్ అనుమానం. అసలు ప్రిన్సిపాలే దాన్నంతనీ అమ్మ్యామ్యా చెయ్యాలనుకున్నాడని, అది కుదరనందున కోపంతో ఉడికిపోతున్నాడనీ లెక్చరర్ల భావన. ఏమయితేనేం అతనికీ వాళ్ళకూ మధ్య చిన్న అయోధ్య మొలకెత్తింది. దీనిక తోడు ప్రిన్సిపాల్ ఆ ఫానును తన గదిలోనే బిగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీంతో లెక్చరర్లు అవసరమయినప్పుడు తప్ప, మిగిలిన సమయాల్లో అతని దగ్గరకు రావటమే మానేసారు.

ఇప్పుడు ఫాన్ బిగించటం అయిపోయి మొదటి సారిగా తనసీట్లో కూర్చుని సుఖంగా ఫాను గాలిని అనుభవిస్తున్న ప్రిన్సిపాల్ పరీక్షిత్తు అలవోకగా నవ్వుల్తో తన పరివార జనాన్నోమాటు వీక్షించి, కొత్త పెళ్ళి కొడుకు లాగా సాగసులు పోయాడు ఉండి ఉండి ఓ మాటు అతను పైకి చూసాడు. ఫుల్ స్పీడ్‌లో తిరుగుతున్న ఆ ఫాను అటూ ఇటూ కదులుతోంది. అతను అదిరిపోయాడు కంగారుగా లేచి చటుక్కున అవతల కొచ్చి అన్నాడు. "ఏమయ్యా సనకసనందనం, ఇది ఊడి నానెత్తిన పడేట్టుంది ఇట్లాగటయ్యా బిగించటం ! ఏదో ముచ్చట పడుతున్నావనీ, పాతికరూపాయలు ఆదా అవుతుందనీ నిన్ను బిగించ మంటే నువు నాకు టపా కట్టించేట్టున్నావే!"

సూపర్నెంటు సనకసనందనం స్క్రూడ్రైవర్ టేబుల్ మీద పెట్టి తలపైకెత్తి చూసి, వెనక్కి వెళ్లి ముందు కొచ్చి పక్క కెళ్ళి, వంగుతూ పైకి చూసి ఇట్లా అనేక భంగిమల్లో ఫ్యాన్‌ను పరిశీలించి పరిశీలించి చివరికి, " అదేంటి సార్ అట్లాంటారు. పైన దూలం అంచులు సరిగ్గాలేవు గదా! అందుకనే యాంగ్యులర్ గట్టి పట్టుబట్టలేదు. దాన్నిసరి చేసెయ్యవచ్చులేండి. అయినా సార్, మీరు అంతమాట అన కూడదు. మిమ్మల్నే నమ్ముకున్నవాణ్ణి, మీచేత్తో లెక్చరర్ ప్రమోషన్ అందుకోవలసిన వాణ్ణి, మీమీద ఈగ వాలనిస్తానా!"

ప్రిన్సిపాల్ చేత్తో తన బట్టతల నిమురుకుంటూ నెమ్మదిగా, " ఏమోలే, నెత్తిన జుట్టుంటే కాస్తుందనే నమ్మకం ఉండేది. ఇప్పటి స్థితిలో ఆ హామీలేదుగా". యుడిసి గంగరాజు అన్నాడు " మొన్న ఏలూర్లో ఏదో సినిమాహాల్లో ఆటజరుగుతూండగా పైనుంచి ఫాను ఊడి పడి ముగ్గురు చచ్చార్ట సార్. ఒక ఆడదానికి ఒక పన్ను, ఒక మగాడికి ఒక కన్ను ఊడి ఎగిరిపోయాయిట." ఇద్దరు ముగ్గురు నవ్వారు. సూపర్నెంటు సనకసనందనం సీరియస్‌గా అన్నాడు "చావుల మాట అబద్ధం. ముగ్గురికి గాయాల మాట నిజం. అదిసరే పన్నూ, కన్నూ పోవటమేంటయ్యా! పై నుంచి ఫానుపడితే కన్నెట్టా పోతుందట.... ఏదీ గాడ్రెజ్ మీది కెక్కి ఈ పెన్ను - ఈ పెన్ను పడేయ్యవయ్యా నిటారుగా నామీదకి. నాపన్నుకు తగులు తుందేమోచూడు ! కాఫీ టిఫినూ ఇప్పిస్తాను ... పన్నూ కన్నూ పోయాయట అయోమయం సరుకు! ఇదుగో పులంటే అదుగో తోక అనే రకం."

గంగరాజు మొహం ముడుచుకున్నాడు. " ఏమో నేను చూసి చచ్చానేంటండీ? ఏలూరు బస్‌స్టాండులో ఎవరో చెప్పుకుంటూంటే విన్నాను. "

" విన్నావయ్యా విన్నావు. కానీ ఎట్టా నమ్మావని? ఇప్పుడు మన అయ్యగార్ని డిమోట్ చేసారని ఎవడో కూస్తాడు నమ్మెయ్యటమే? ' వారేంటి, వారి ఎక్స్‌లెంట్ సర్వీస్ రికార్డేంటి,డిమోసనేంటి?' అన్న అనుమానమైనా రావద్దా?... సార్, ఈ గంగరాజు ఇంక ప్రమోషన్ కు అన్‌ఫిట్ సార్?"

ప్రిన్సిపాల్ వచ్చి సీట్‌లో కూర్చోలేదు. ఇంకా బీరువాల పక్కనే నుంచున్నాడు. అన్నాడు" సర్లే సనకసనందనం, మీ గోల ఎప్పుడూ ఉన్నదే గాని ముందు దీని విషయం చూడు."... " అది ఖాయం సార్!" ... " ఏంటి, అది నా నెత్తిన పట్టమా!" ... " అహఁహఁ అది కాద్సార్ యాంగ్యులర్ బిగవటం. దాన్నిప్పుడు బిగించేస్తాను గద్సార్. ఏఁయ్ రాజూ ఫాను ఆపు చెయ్యవోయ్ ఈ కుర్చీ ఈ టేబుల్ మీద పెట్టు".

తన కింది వాళ్లమీద అధికారం, రీవి ఎంత బాగా చలాయించగలిగితే ఒక అధికారికి తానంత గొప్పవాడుగా లెక్క. తనపైవాడి దగ్గర చేతులు కట్టుకొని నుంచొని తనొక మూర్ఖుణ్ణనని ఒప్పేసుకుంటూ 'సార్ సార్' అని ఎన్నిమాట్లు అనగలిగితే తానంత విధేయుడయినట్లు కిందివాడికి లెక్క.ఈ లెక్కల ఎక్కాలన్నీ తెల్లవాడి పుణ్యమా అంటూ మన దేశంలో అతి లోతుగా పాతుకొని పోయాయి. కృష్ణుడో, క్రీస్తో, ఇంకోడో ఇంకోడో మళ్లీ పుడితేనే గాని ఇవ్వి పోయే సూచన్లు దుర్భిణితో చూసినా కనిపించటం లేదు.

కిందున్న కుర్చీని టేబుల్‌మీది కెక్కించాడు ఫ్యూన్ రాజు. సూపర్నెంటు సనకసనందనం దానిబ మీదికెక్కాడు. రాజు అతనికి స్క్రూడ్రైవరు అందిస్తూ అవసరార్థం తాను కూడా ఎక్కి ఫానును కింది

నుంచి పైకి ఎత్తి పట్టుకున్నాడు సూపర్నెంటు యాంగ్యులర్‌ను బిగించాడు కిందికి దిగాడు రాజు టేబిల్ మీంచి కుర్చీ తీసేసాడు ప్రిన్సిపాల్ పరిక్షిత్తు అన్నాడు? "ఈ టేబిల్సు రెండింటినీ ఇట్లా జాయింటు చేసుంచకుండా కొంచెం ఎడంగా జరిపిపుంచుతే మంచిదనిపిస్తోందయ్యా. ఫాను గాలి తిన్నగా ఆ ఖాళీ లోంచి కిందికెళ్ళిపోయి నా చూట్టూ కూర్చున్న వాళ్ళ కాళ్ళక్కూడా తగుల్తాంటూంది. ఏమంటావ్?"

సనకసనందనం " బ్రిల్లియంట్ అయిడియా సార్!" అంటూ "జరపవోయ్ రాజూ, ఈ బల్లల్ని దూరంగా జరుపు. జాగ్రత్త ఆ ప్లాస్టిక్ కాలెండరూ పేపరు వెయిట్సూ పడిపోగలవ్! నాటేబిలు క్లాత్ తీసుకొచ్చి ఈ రెండో దానిమీద వేసి సరిచెయ్యి" అన్నాడు

రాజు టేబిల్సును దూరంగా జరిపాడు. క్లాత్ తెచ్చి వేసాడు.గుమాస్తా గంగరాజు వెనక్కు నడచి దూరంగా వెళ్ళి తలుపు దగ్గర నుంచొని ఇంకో గుమాస్తాతో ఏదో అంటున్నాడు. సనకసనందం వెళ్ళి "ఏంటో మర్మరింగ్సు?" అన్నాడు.

గంగరాజు మళ్ళీ బుర్ర గోక్కుంటూ" ఏంలేదు లెండి... నాకో స్మాల్ అయిడియా. చెప్పడానికి అంత బాగుండదనుకుంటాను."

" ముందు అదేదో చేప్పేడవయ్యా బాబూ!" నసుగుతూ అన్నాడు గంగరాజు -" ఇప్పుడా టేబిల్సు మధ్య ఖాళీలోంచి కింది కెళ్ళినగాలి చుట్టూ కూర్చున్న వాళ్లకాళ్ళకు తగలాలని గదా అయ్యగారన్నారు. మరి వాళ్ళ పాంట్లు అడ్డొస్తాయి గా ! ఆ ఖాళీలో ఒక పెద్ద గొట్టం నిలబెట్టి దానిక్కింద చుట్టూ కన్నాలు చేసి ఒక్కొ కన్నం దగ్గరా ఒక్కో రబ్బరు ట్యూబు తగిలించి కుర్చీల్లో కూర్చున్న వాళ్ళకు తలా ఒకటీ ఇస్తే, వాటిని వాళ్ళు కింద నించి తమ పాంటుల్లోకి దోపుకుంటారు అంటే, ఈ సిస్టం ఒక ఎనిమా గొట్టం లాగా ఉంటుదన్నమాట? అప్పుడు అందరికీ పైనుంచీ, కిందనుంచీ కూడా సమానంగా గాలి తగుల్తుంది.'

సనకసనందనం తెల్లబోయాడు. నాలుగుక్షణాలాగి ," నీ తెలివి మండినట్టే ఉంది... బల్లలు జరపటం ఇష్టంలేదని ఏడవకూడదూ?" ప్యూన్లూ తదితరులూ చేతులు అడ్డం పెట్టుకుని నవ్వు కుంటున్నారు. గంగరాజు అన్నాడు" అందుకే చెప్పనన్నాను. అయినా సూపర్నెంటు తెలివి యు.డి.సి.కి ఎట్లా ఉంటుంది లెండి.!"

అది నిజమనుకో. " కానీ... ఇంకా నయం , ఎవరి ట్యూబు వాళ్ళు తెచ్చుకొవాలని నోటీసు పెట్టాలన్నావు కావు." గదిలోంచి ప్రిన్సిపాల్ " ఏంటయ్యా, గుసగుస లాడుకుంటున్నారు?" అన్నాడు.

సనకసనందనం అన్నాడు " ఏం లేద్సార్. ఇప్పుడు మరి మీ టేబిల్ ఫాన్ అక్కడ్నుంచి తీసేసి దాని గాలి ఒక్క మీమీదకే వచ్చేట్టు మీ వెనకాల అక్కడ దూరంగా స్టూలుమీద ఉంచితే ఎట్లా ఉంటుందోనని ఆలోచిస్తున్నాన్సార్."

ప్రిన్సిపాల్ ఒక్క క్షణం ఆలోచించాడు- అన్నాడు, " భలేవాడివయ్యా. ఇంకా అది నాకెందుకు? తీసుకోపో. తానుకు పోయి నీ టేబిల్ మీద పెట్టుకో. కొత్త కాలేజీ కదా, అన్ని ఎమెనిటీసూ వచ్చే వరకూ ఇట్లాంటి ఎడ్జస్టుమెంట్స్ ఏవో తప్పవు మరి!"... " థాంక్స్ సార్, థాంక్స్!" సనకసనందనం మహానంద పడిపోతూ పళ్ళికిలిస్తూ గబగబా అక్కడున్న టేబిలు ఫాను తీసికెళ్ళి తనటేబిల్ మీద పెట్టుకున్నాడు.

ప్రిన్సిపాల్ టీలు తెప్పించాడు. అందరూతాగి ఎవరిసీట్లోకి వారు వెళ్ళిపోయారు

★ ★ ★

పావు గంట గడిచింది. స్టాఫ్ అసోసియేషన్ సెక్రటరీ అయిన లవకుశ రావు వచ్చాడు ప్రిన్సిపాల్ పరీక్షిత్తు దగ్గరికి. పైన తిరుగుతూన్న కొత్త ఫాన్ చూసాడు. అన్నాడు " ఒహో కొత్త ఫాన్ ఇక్కడి బిగించారాండి?... అన్నట్టు స్టాఫ్ రూముక్కూడా ఫాన్ చాలా అవసరమండి మేము చాలా ఇబ్బంది పడిపోతున్నాం. డౌట్సు అడగటాని కొచ్చిన స్టూడెంట్సు ముందు తడిసినకాలర్లతో కూర్చోవటం మాకే అసహ్యమనిపిస్తోంది. మీకు పూర్వం చెప్పాననుకుంటాను."

" చెప్పారు చెప్పారు, కొంతకాలం ఆగండయ్యా,పైనుంచి మనకింకా ఎన్నో రావాలి. వాటితో పాటే మీకు ఫానూ వస్తుంది."... " ఎప్పటికో గదండీ. అప్పటిదాకా.. "... " ఎంతో కాలమా అబ్బే, అయిదార్నెల్లు, కాదంటే ఏడాది. అయినా అక్కడ ఎవరు శాశ్వతం? అందరం ట్రాన్స్ఫరయి పోయమేవాళ్ళమే. ఏదో కాలక్షేపం చేసెయ్యాలి."

" అదేంటండి, ఎవరయినా అవుతారేమో గాని నేను ట్రాన్స్ఫర్ అవ్వనండి. ప్రమోషన్ రాని పక్షంలో నేను ఒక్కడే రిటైర్ అవ్వవలసిన వాణ్ణి. ఐ హావ్ టు రిటైర్ హియరోన్లీ?"... "ఇఫ్ నోవన్ డిస్ప్లేసెస్ యూ (ఎవరయినా నిన్ను కదలిస్తే)... "... " అబ్బే, అట్లాంటిదేం ఉండదండి. మా ఊరిక్కడికి పది మైళ్ళేగదా. నా కిక్కడ హక్కు ఉంది. పైగా ఎమ్మెల్యేగారు మా పెత్తాతగారి వదినెగారి మనవడు కూడాను !".. " డైరెక్టరే చేస్తే?" ... " తమాషా అనుకుంటున్నారేంటండి ! నా బావమరిది బావగారు అసిస్టెంట్ డైరక్టర్. నా మిసెస్‌గాని ఫోన్ ఎత్తిందంటే .."

పరీక్షిత్తు తన కుర్చీలో అటూ ఇటూ కదిలాడు. అసహనంగా మొహం పెట్టి హఠాత్తుగా అన్నాడు; " ఇంతకీ ఈఫాను స్టాఫ్ రూమ్ కిచ్చెయ్యమంటారు అంతేనా?" ... "అవునండి - మీది మీకుంది గదండి" ... "నో సారీ?.... ఇంతకి మీరొచ్చిన పని?"... " ఆల్‌రైట్ ! మీ ఇష్టం..... మాగజైన్ మేటరు తెమ్మన్నారు గదా తెచ్చాను".

పావుగంట తర్వాత లవకుశరావు వెళ్ళిపోయాడు. పరీక్షిత్తు కాలింగ్‌బెల్ నొక్కి సూపర్నెంట్ సనక సనందాన్ని పిలిచాడు. " ఈ లవకుశరావు కొంపముంచేట్టున్నాడయ్యా. ఈ ఫాన్ తీసికెళ్లి స్టాఫ్ రూమ్‌లో బలవంతంగానైనా బిగించేసుకొనేట్టున్నాడు"... " అదెట్లా కుదుర్తుంది సార్?.....ఇక్కడున్న విషయం ఫైల్సులో రాసాం గదా!"... "ఫైల్సో వల్లకాడో తర్వాత. ముందర ఆ కాస్త పనీ చేసేస్తే ఏం చేయాలి? ఎక్స్ప్లనేషన్ అడగడం, అతగాడు రిప్లైఇవ్వటం, ఫైల్ పెరగటం. పైకి రిపోర్టు- ఇదంతా అయ్యి అక్కడ్నుంచి డైరక్షన్ ఊడి పడేప్పటికి ఏళ్లూ పూళ్ళూ గడవటమూను! హెడేక్! ఇప్పటికే ఈయన్తో వేగలేకుండా ఉన్నాం. ఇహ అప్పుడు చెప్పాలా? ఏ సోర్ ఇన్ ది ఐ!"... "అదేంటి సార్, మీ పర్మిషన్ లేకుండా కాలేజీలో గాలయినా స్థానం మారగలదా?" "అనుకో, ఊ అంతేననుకో, కానీ పి.హెచ్.డి. థీసిస్ కోసం మూణ్ణెల్లు సెలవు పెట్టబోతున్నానే. ఈ లవకుశరావుకే ఫుల్ చార్జి రావటం ఖాయం. అప్పుడే ఫాను స్థానభ్రంశం పొందటం ఖాయమన్నర!"... " అయితే సార్, ఒక పన్చేద్దాం సార్, ఫాన్ మీద,- " ప్రెజెంటెడ్ టు ప్రిన్సిపాల్ రూమ్ ఓన్లీ బై స్టూడెంట్స్ - అని రెడ్ పెయింట్‌తో రాసేద్దాం సార్. ఇహ ఆయన పప్పులు ఉడకవ్". అప్పుడే ఫైల్సుతో లోపలికొచ్చిన యల్.డి.సి. గంగరాజు అన్నాడు- "ఆయన ఫాన్ మొత్తానికి బ్లాక్ పెయింట్ వేయిస్తేనో!" సనకసనందనం గంగరాజువైపు కోపం కక్కుతూ చురుక్కున చూసాడు.

గంగరాజు తలదించుకున్నాడు పరీక్షిత్తు అన్నాడు "అదీ పాయింటే!" హటాత్తుగా తలుపు తోసుకుని స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్ నలుగురు స్టూడెంట్స్‌తో లోపలికొచ్చాడు నమస్కారం పెట్టాడు అన్నాడు "యూనివర్సరీ ఫంక్షన్‌కు ముఖ్య అతిధిని మాతో సంప్రదించకుండా నిర్ణయించటం అన్యాయం సార్. మేము చిరు శ్రీ గార్ని పిలవాలనుకున్నాం మీరేమో..." పరీక్షిత్తు అన్నాడు "బాగుందయ్యా, ప్రతి చిన్న విషయానికీ మిమ్మల్ని సంప్రదించాలంటే కుదిరే పనేనా? ఈమాటుకేదో అయిపోయింది. నెక్స్ట్ ఇయర్ చూద్దాం లెండి?"

ప్రెసిడెంటు పైన తిరుగుతూన్న ఫాను వైపు చూసి అన్నాడు "మేము డొనేట్ చేసిన ఫానేకదా సార్.. లైబ్రరీ రూములో పెట్టించమని అడిగాం కదా? రేకుల కప్పు మూలంగా రీడింగు రూముతో సహా లైబ్రరీ మొత్తం హీటింగ్ రూమ్‌గా మారిపోతోంది. లెక్చరర్సూ మేమూ చాలా ఇబ్బంది పడిపోతున్నాం సార్"

పరీక్షిత్తు కనుబొమ్మలు ముడిపడ్డాయి. "అవునబ్బాయ్ అడిగారు. కానీ కుదరొద్దూ! రేకుల వేడికి మాత్రమే మీకు హీటెక్కుతోంది కానీ, వర్కు వేడికి నాకు లోపల్నుంచి కూడా హీటెక్కుతుంది. అందుకని దీన్నిక్కడే బిగించమన్నాను.... అయినా, ఒహ మాటు డొనేట్ చేయటం అంటూ జరిగాక ఆ విషయం మర్చిపోవాలి గానీ ప్రతి స్టేజీలోనూ,పట్టించుకుంటుంటారా?ప్రాక్టికల్ పరీక్షల్లోనూ వాటిల్లోనూ బాగారాసి మా చేత మంచి మార్కులు వేయించుకొని డిగ్రీపుచ్చుకొని వెళ్లిపోవలసిన వారు మీరు. ఏమంటావు?" పక్కనున్న స్టూడెంట్సు, ప్రెసిడెంటును చటుక్కున పక్కకిలాగి 'పోదాం పదరా, ఫానుని ఎక్కడ బిగిస్తే మనకెందుకు? మన్ని పరీక్షల్లో బిగిస్తే చస్తాం' అని సన్నగా గొణిగారు. ప్రెసిడెంటు మళ్ళీ ప్రిన్సిపాల్‌కు నమస్కారం పెట్టి స్నేహితుల్తో బయటికి వెళ్లిపోయాడు.

★ ★ ★

ఇంతసేపూ అక్కడే ఉన్న గంగరాజు ఉండి ఉండి "చూడబోతే స్టూడెంట్సూ, స్టాఫూ వచ్చి తలారెక్కా విరుచుకుపోయేట్టున్నారు" అని సనకసనందనం వైపు చూసి తప్పుచేసినట్టు చటుక్కున తలొంచుకున్నాడు. సనకసనందనం "నువ్వెక్కడి అపశకున పక్షివయ్యా! నోటికి మంచిమాటలు రావేమిటి?" అంటూ కాసేపాగి "అది అసంభవం కాదనుకో.... అయినా ఆ విషయం నేను చూసుకోగల్ను. నువ్వు చెప్పనక్కరలేదు. అవసరమైతే ఓ శిలా శాసనం లాంటిదాన్ని క్షణాల మీద ఏర్పాటు చేయగల్ను. తెల్సా".

గంగరాజు వెంటనే అందుకొన్నాడు; "ఆ ఆ రైట్సార్, పూర్వం అశోకుడు, చిత్రగుప్తుడు మొదలైన వాళ్లు చేసిన పన్లు శాశ్వతంగా అందరికీ తెలుస్తూండటానికి రాగిరేకుల మీద, శిలాఫలకాల మీద శాసనాలురాయించి పాతించేవారు. అట్లాగేమనం కూడా ఒక శిలా శాసనం రాయించి మన గది బయట పాతించొచ్చు. ఎట్లాగయినా సూపర్నెంటుగారి బుర్ర సూపర్నెంటు బుర్రే!" సూపర్నెంటు కనుబొమలు ముడిపడ్డాయి. "చిత్రగుప్తుడు కాదయ్యా చంద్రగుప్తుడు అది దిద్దుకో ముందర. అయినా నేను శిలాశాసనం లాంటిదన్నాను కాని శిలాశాసనమే అన్లేదు. నాకా మాత్రం తెలీకపోలేదు" అంటూ గంగరాజుకు దగ్గరగా వచ్చి రహస్యం చెప్పుతున్నట్టు నెమ్మదిగా, "ఏ కాలేజీ ఆఫీసు గుమ్మంలో నయినా అట్లాంటిదొకటి - అదే ఈ ఫాను ప్రిన్సిపాల్ గారిది?- అని రాసున్న ప్లేటు చూసిన జ్ఞాపకంగానుందా నీకు?" అన్నాడు.

గంగరాజు సాలోచనగా మొహం పైకెత్తి తల గోక్కుంటూ "ఎక్కడో చూసినట్లే..ఉంది సార్.." అన్నాడు. పరీక్షిత్తు అటూ ఇటూ పచార్లు చేసి నాలుగు క్షణాలాగి అన్నాడు - "నువ్వు అన్నదాంట్లో పాయింటు లేకపోలేదయ్యా సనకసనందనం ! శిలాశాసనం పాతించటం కాదు గాని మనం ఓ పని చెయ్యొచ్చు. పైన దూలం మీద ఫాను పక్కగా 'ఈ ఫాను ప్రిన్సిపాలు గారి గదికి ప్రెజెంట్ చెయ్యబడింది. కదిలించగూడదు' అని చెక్కిస్తే ఎట్లా ఉంటుంది?"

ఇట్లా అంటూ పరీక్షిత్తు గంగరాజు వైపు చూడగా, గంగరాజు సనకసనందనాన్ని చూడగా, సనకసనందనం పరీక్షిత్తు వైపు చూసాడు. చూస్తూ హఠాత్తుగా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ అన్నాడు సనకసనందనం- " మీ అయిడియా బ్రిలియంట్ సార్ ! ... అయితే ఎవర్నో పిలవటం దేనికి సార్.నేనే సుత్తీ ఉలీపట్టు కొచ్చి దూలం మీద చెక్కేస్తాన్సార్. బాగా కనిపించడానికి రెడ్‌పెయింట్‌తో అక్షరాల్ని దిద్దితే సరి. ఏమంటార్ సార్? ఇది కూడా ఒకరకంగా శిలాశాసనమే కదా సార్ ! ఇహ దీన్ని ఎవడూ కదిలించలేడండి!"

"వెల్, వెరీ గుడ్ అయితే వెంటనే కానిచ్చెయ్".

" ఇప్పుడు కాదు రేపు కాలేజీకి వచ్చేప్పుడు పనిముట్లుతెచ్చుకుంటాను. ఎంతసార్ పావుగంట పని"... " రేపా? ఆల్ రైట్!"

★★★

ఇంతలో పోస్టుమాన్ పోస్టు తెచ్చాడు.

అందులో ప్రిన్సిపాల్ పరీక్షిత్తుకు ఒక ఆర్డరుంది? ఎన్.సి.ఇ.ఆర్.టి. వాళ్ళు నిర్వహిస్తున్న ఆర్నెల్ల ట్రెయినింగుకు అతన్ని సెలక్ట్ చేసారనీ, వైస్ ప్రిన్సిపాల్ లవకుశరావుకు ఫుల్ అడిషనల్ చార్జి ఇవ్వబడిందనీ, లవకుశరావు చార్జి అప్పగించి తక్షణం బయల్దేరి మర్నాటికల్లా పరీక్షిత్తు రిపోర్టు చెయ్యాలని - దాని సారాంశం!

పరీక్షిత్తు చేతిలోంచి కాగితం జారిపడిపోయింది. తలెత్తి పైన తిరుగుతున్న ఫాను వైపు చూసి గట్టిగా నిట్టూర్చాడు. ఉసూరుమంటూ జారి కుర్చీలో కూలబడిపోయాడు - స్పెషల్ ట్రెయినింగుకు సెలక్టయిన కాబోయే పి.హెచ్.డి సీనియర్ మోస్టు ప్రిన్సిపాల్ అయిన శ్రీమాన్ పరీక్షిత్తు!

(జాగృతి దీపావళి సంచిక 1980)

★★★ ★★★ ★★★

# రాజుగోల

"నా చిలకల కొలొకి, నా రత్నాల మొలక, నా వజ్రాల తునక, నా ముత్యాల మూట, నా నోముల్ల పంట నా రాజనిమ్మల పండు".. "అదుగో అదుగో అదే అనొద్దన్నాను రోజాదేవీ! ఎన్నైనా అను పిల్లాణ్ణి. కానీ రాజు అని అనొద్దన్నాను. రాజులు పోయారు. రాజ్యాలు పోయాయి. ఇది ప్రజల రాజ్యం కార్మికుల రాజ్యం. నా రాజనిమ్మలపండు అని ఇంకెప్పుడూ అనకు! కావలిస్తే నా కూలి నిమ్మలపండు అను"